క్లుప్తంగా

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. వీటిని ప్రభుత్వం సరఫరా చేసింది. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బండారును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీసీఎం రమేష్ సోదరుడు సురేష్, ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పులుల సంరక్షణ దినోత్సవం


సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణ

చోడవరం రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం జువాలజీ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పులల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ నారాయణమూర్తి మాట్లాడారు. జీవావరణ వ్యవస్థ గురించి, అడవులు, అటవీ ఉత్పత్తుల సంరక్షణ, జంతువుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ గురించి జువాలజీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ వి.రత్న భారతి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 24 మంది ఎంపిక


శిబిరంలో రోగులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

చోడవరం రూరల్: నేత్ర శస్త్రచికిత్సలకు 24 మంది ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చోడవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ 41 మంది రోగులను ఆప్తాలమిస్టు నీలం నాగేంద్రబాబు పరీక్షించారు. రోగులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి సాంబశివరావు, సర్వీస్ చైర్మన్ ముక్కా రమేష్, ప్రాజెక్టు చైర్మన్ బి.ఫల్గున్, వేపాడ సత్యనారాయణ సేవలందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మేఘన

కె.కోటపాడు: ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి మేఘన అన్నారు. సోమవారం మెరక రామచంద్రపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. 89 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, పి.హెచ్.ఎన్. అచ్చియ్యమ్మ, ఏఎన్ఎం చిన్నమ్మలు పాల్గొన్నారు.

1న చీరలు, కొబ్బరి చెక్కల హక్కు వేలం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి నివేదించిన చీరలు, రవికెలు, కొబ్బరి చెక్కలను ఏడాదిపాటు పొందేందుకు టెండర్, బహిరంగ వేలంను వచ్చే నెల 1న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజసులోచన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్సు హక్కు చీరలు, రవికెలకు 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు, కొబ్బరి చెక్కల సేకరణకు ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఉంటుందన్నారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు చొప్పున ప్రథమ ధరావతు చెల్లించాలన్నారు.


రోలుగుంట: కొండపాలెంలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు


కె.కోటపాడు: గొండుపాలెంలో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న సర్పంచ్ కనక మల్లీశ్వరి


దేవరాపల్లి: పాఠశాల భోజనంతోపాటు దాతలు సమకూర్చిన అదనపు ఆహార పదార్థాలు


దేవరాపల్లి: బల్లిపురం ఎంపీపీ స్కూల్ భోజనం చేస్తున్న విద్యార్థులు


నర్సీపట్నం: విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర

విద్యతోపాటు ఆరోగ్యం

- పాఠశాలల్లో దాతల సాయంతో విద్యార్థులకు పౌష్టికాహారం
- ముగిసిన శిక్షా సప్తాహ్


బుచ్చెయ్యపేట, దిబ్బిడి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న ఉపాధ్యాయులు


మాకవరపాలెం: కేజీబీవీలో మిఠాయిలు అందజేస్తున్న చైర్మన్ నారాయణమూర్తి

నాతవరం: విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యం చాలా ముఖ్యమని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం సరుగుడు, మర్రిపాలెం పాఠశాలల్లో పీఎం పోషణ్ భాగంలో శుభ దిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. సరుగుడు పాఠశాలలో అరటి పండ్లు, మిఠాయిలు, భోజనం తయారు చేసేందుకు సామగ్రిని సొంత నిధులతో ఎంపీపీ అందజేశారు. మర్రిపాలెంలో విద్యార్థులకు డ్రై ఫ్రూట్స్ దాతలు గవిరెడ్డి త్రినాథ్, బోత్సా కృష్ణ, పోతల సతీష్, బ్రహ్మజీ, రాజువరహాలు అందజేశారు.


నాతవరం: మర్రిపాలెంలో విద్యార్థులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ

విద్యార్థులకు రుచికరమైన భోజనం

నర్సీపట్నం: శిక్షా సప్తాహ్ ముగింపు సందర్భంగా మున్సిపాలిటీలో వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో దాతలు శ్రీరామాంజనేయ క్లాత్ షాపు యజమాని కె.రాంబాబు, హోటల్ యజమాని రాజేష్‌ల సహకారంతో విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈవోలు సిహెచ్.తలుపులు, నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. దాతలు బిర్యానీ, చికెన్ కూర, బూరె, గారె, పాయసం, పచ్చడి, అరటిపండు, లడ్డూ, పెరుగు, రైస్, సాంబారు, వెజ్ కర్రీ, వాటర్ బాటిల్స్ సమకూర్చారు. కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య, స్కూల్ కమిటీ చైర్మన్ మణి, రాంబాబు, ఉపాధ్యాయులు డి.గోపీనాథ్, వీరమాంబ, సునీత, సత్యవేణి పాల్గొన్నారు.


నాతవరం: సరుగుడులో ఉపాధ్యాయులకు అరటి పండ్లు, మిఠాయిలు అందిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

విద్యార్థులకు మిఠాయిలు, పండ్ల పంపిణీ

మాకవరపాలెం: విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. శుభ తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో విద్యార్థినులకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.నారాయణమూర్తి, సభ్యులు మిఠాయిలు పంచిపెట్టారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పల్లి లోవరాజు అరటి పండ్లు అందజేశారు. కేజీబీవీ ఎస్‌వో త్రివేణి, తూటిపాల హెచ్‌ఎం కె.రాము పాల్గొన్నారు.

దేవరాపల్లి: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, ఎంఈవో-2 వి. ఉషారాణి తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏడో సోమవారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శుభదిన్ భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు, ఉపాధ్యాయులు సహకారంతో పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: విద్యార్థులు చదువులతోపాటు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం గొండుపాలెంలో పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించారు. ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, పీఈటీ రోహిణి, ఉపాధ్యాయిని తార పాల్గొన్నారు.

రోలుగుంట: ఈ నెల 22న ప్రారంభమైన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. కొండపాలెం పాఠశాలలో హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్ విద్యార్థులకు ఈ కార్యక్రమాల ప్రాధాన్యం గురించి వివరించారు. మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమాలను ఎంఈవో-జానుప్రసాద్, ఎంఈవో-2 జగ్గారావు పర్యవేక్షించారు.

బుచ్చెయ్యపేట: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ దిన్ భోజనం అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. బుచ్చెయ్యపేట, దిబ్బిడి జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు, వడ్డాది మెయిన్ స్కూల్‌లో యువజన సంఘ నాయకుడు దొండా నరేష్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు మిఠాయిలు, పండ్లు అందించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాలు రుచి చూశారు. ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు, హెచ్‌ఎం టి.వి. శేషగిరిరావు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో విద్యార్థులకు మిఠాయిలు అందిస్తున్న యువజన నాయకుడు నరేష్

మాడుగుల రూరల్: ఎం. కోడూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు బీజేపీ నాయకుడు గొల్లవిల్లి రాజేష్, వరలక్ష్మి దంపతులు మిఠాయిలు పంచిపెట్టారు. శుభ్ దిన్ భోజన్‌లో భాగంగా సోమవారం మధ్యాహ్న భోజనంలో 500 మంది విద్యార్థులకు వీటిని అందించారు.

నిఘా నీడలో తహసీల్దార్ కార్యాలయం


తహసీల్దార్ గదిలో అమర్చిన సీసీ కెమెరా


బుచ్చెయ్యపేటలో రికార్డు గది వద్ద..

బుచ్చెయ్యపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ రికార్డులు గల్లంతవుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ అరుణ్‌చంద్ర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తహసీల్దార్ గది, రికార్డు భద్రపరిచే గది, తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు వీటిని అమర్చారు. వీటి ఏర్పాటుతో రెవెన్యూ సిబ్బందితోపాటు కార్యాలయానికి వచ్చే వారు కదలికలపై నిఘా ఉంచనున్నారు.

మెడికల్ వ్యర్థాల తొలగింపు


చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మాకవరపాలెం: సర్పానదిలో మెడికల్ వ్యర్థాలను తొలగించారు. ఈ నెల 28న సర్పానదిలో మెడికల్ వ్యర్థాలు అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి ఆదేశాలతో పంచాయతీ అధికారులు సర్పానదిలో వేసిన మెడికల్ వ్యర్థాలను కాల్చి వేయించారు. సమీపంలో చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఇతర మండలాల నుంచి కోళ్లు, మెడికల్ వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ వేసినట్టు గుర్తించామన్నారు. ఇకపై వేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. డివిజన్ పరిధిలోని భూసమస్యలు, వివిధ రకాలకు సంబంధించి 11 ఫిర్యాదులు వచ్చాయి. మున్సిపాలిటీ 6, 15, 10 వార్డుల్లో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవటం వల్ల మురుగు పారక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విశ్వనాథరాజు, వరహాలు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పొలాలకు వెళ్లే బండిబాట ఆక్రమణకు గురైందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని రెడ్డి సత్యవతి తదితరులు ఫిర్యాదు చేశారు. పింఛన్ పునరుద్ధరించాలని 6వ వార్డుకు చెందిన కాళ్ల అనంత ఆదినారాయణ విన్నవించాడు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో అధికారులకు సూచించారు.

పారిశుధ్యం మెరుగుతో సంపూర్ణ ఆరోగ్యం


రొంగలినాయుడుపాలెంలో అవగాహన ర్యాలీలో సర్పంచ్ పైడితల్లమ్మ, భీమరాజు


కె.కోటపాడులో అవగాహన ర్యాలీలో మండల అధికారులు

కె.కోటపాడు: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పారిశుధ్యం మెరుగుతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ పైల పైడితల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి కె.భీమరాజు తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా రొంగలినాయుడుపాలెంలో సోమవారం వీరు ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోనే చెత్తను వేయాలని సూచించారు. ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

పారిశుధ్య పక్షోత్సవాల సందర్భంగా కె.కోటపాడులో మండల స్థాయి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటి వద్ద మురుగు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ తెలిపారు.

అందుబాటులో లేని ఉచిత ఇసుక

- సీపీఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన ఉచిత ఇసుక పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో లేదని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు విమర్శించారు. కె.కోటపాడు మండలంలో ప్రజలకు ఎక్కడ ఉచిత ఇసుక అందుతుందో నేటికీ తెలియడం లేదని వాపోయారు. ఈ కారణంగా పేద, మధ్య తరగతుల ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయినట్లు తెలిపారు. భవన నిర్మాణ రంగం పైన ఆధారపడ్డ మేస్త్రీలు, కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉచిత ఇసుకపై క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని గుర్తించాలని కోరారు.

సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా ఎ. కొత్తపల్లి

- దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి కోరారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అధ్యక్షతన ప్రత్యేక పారిశుధ్యంపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని స్థానిక అధికారులకు సూచించారు. గ్రామంలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. బ్లీచింగ్ చల్లించాలన్నారు. మంచినీటి ట్యాంక్‌లను క్లోరినేషన్ చేపట్టడంతోపాటు పైపులైన్లు లీకేజీలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. పారిశుధ్యం మెరుగు ప్రజలు సహకరించాలని సర్పంచ్ వెంకటరమణ కోరారు. ఉప సర్పంచ్ పందూరు సరువునాయుడు, పంచాయతీ సెక్రటరీ టి. పవన్‌కుమార్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, సచివాలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన


ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న నాయకులు

రోలుగుంట: ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరులో ఆయిల్ పామ్ విస్తరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుతో మేలు, రాయితీపై మొక్కలు, బిందు సేద్య పరికరాల గురించి ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి శిరీష వివరించారు. వీటి సస్యరక్షణతోపాటు ఆశించిన దిగుబడులు ఎలా వస్తాయో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్రతినిధి తోట చంద్రశేఖర్ వివరించారు. సర్పంచ్ గుములూరి సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, ఉద్యాన, వ్యవసాయ శాఖ సిబ్బంది కె.రమేష్, ఎం.రవికుమార్, జి.సత్తిబాబు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

మునగపాక: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు సోమవారం ఆందోళన నిర్వహించారు. వారాల తరబడి ఉపాధి వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

డిసెంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న జిల్లా కమిటీ సభ్యుడు రాజు

నర్సీపట్నం: పట్టణంలో డిసెంబర్ 8, 9 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 27న అనకాపల్లిలో జరిగిన ప్లీనరీ సమావేశంలో నిర్ణయించామన్నారు. మూడు దశాబ్దాలుగా భూసమస్యలపైనే కాకుండా మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించిందన్నారు. లేటరైట్ అక్రమ మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహించామన్నారు. అన్‌రాక్ నిర్వాసితుల నష్టపరిహారం గురించి అనేక ఉద్యమాలు చేశామన్నారు. కార్మికుల హక్కుల కోసం పని చేశామన్నారు. జీడిపిక్కల కార్మికుల కూలి రేట్లు పెంపు కోసం పోరాడి ప్రభుత్వ నిర్బంధాన్ని, కేసులను ఎదుర్కొన్నామన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న మహాసభలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు.

గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు


జె.నాయుడుపాలెంలో స్ప్రేయింగ్ పనులు పర్యవేక్షిస్తున్న ఈవోపీఆర్డీ నూకరాజు

రోలుగుంట: మండలంలో దోమల నివారణ చర్యలు చేపట్టినట్టు ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు తెలిపారు. దీనిలో భాగంగా జె.నాయుడపాలెం, జగ్గంపేట గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ వీధుల్లోను, కాలువల్లోను ఎబేట్ (దోమల నియంత్రణ)మందులను పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. సర్పంచ్ బగుడు వెంకటరమణ, ఏఎన్ఎం పరమేశ్వరి పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు కప్పేశారు...


రీ సర్వే డీటీ పడాల్‌కు వినతి అందజేస్తున్న రైతులు

మునగపాక : సాగునీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ డిమాండ్ చేశారు. మునగపాక మెయిన్‌రోడ్డు దరి లే-అవుట్‌ల కారణంగా సాగునీటి కాలువలు కప్పేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సాగునీటి కాలువలను పైపులతో కప్పేయడంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదన్నారు. దీంతో ఎగువ ప్రాంతాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అనంతరం రీ-సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. కాగా రైతులకు అసౌకర్యం కలిగించేలా ఉన్న ఇరిగేషన్ ఏఈ చర్యల పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మహిళా కార్మికులకు వేధింపులు'

అచ్యుతాపురం : మండలంలోని ఒక దుస్తుల కర్మాగార అనుబంధ కంపెనీలో ఒక ఉద్యోగిని వేధింపులకు గురై మృతి చెందారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆరోపించారు. కంపెనీలో పనిచేసే మహిళా ఉద్యోగులకు వేధింపులు ఎక్కువ అయ్యాయని, జీతం పెంచమని అడిగితే మహిళా ఉద్యోగుల్ని తొలగిస్తున్నారని అన్నారు. రాత్రి వేళల్లో మహిళా ఉద్యోగుల చేత పని చేయించకూడదనే నిబంధనలు ఉన్నా ఆ కంపెనీ నిబంధనలను అమలు చేయడం లేదన్నారు.